## జ్వరం లక్షణాలుంటే వైద్యులను సంప్రదించాలి



గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డా. రవితేజ

కరకగూడెం, ఏప్రిల్ 28: గ్రామాల్లో ఎవరైనా జ్వరం లక్షణాలతో బాధపడుతుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని కరకగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి రవితేజ అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం మండలంలోని అనంతారం, సర్వాపురం, రామానుజవరం గ్రామాల్లో జ్వర లక్షణాలు లేని మలేరియా కేసులు గుర్తించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అకాల వర్షాల వల్ల నీరు నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగ్యూ జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రేమ వివాహం.. విషాదాంతం



శ్రీను-దీపిక దంపతులు (ఫైల్)

టేకులపల్లి, ఏప్రిల్ 28: వారిద్దరూ ప్రేమించుకున్నారు. వారి పెళ్లికి పెద్దలు ఒప్పుకోలేదు. వారిని ఎదిరించి, ఆరు నెలల క్రితం వివాహం చేసుకున్నారు. ఆమెకు అత్తింటి వేధింపులు మొదలయ్యాయి. దీనిని ఆమె భరించలేకపోయింది. తన తల్లిదండ్రుల తీరును అతడూ సహించలేకపోయాడు. వారిద్దరూ ఆత్మహత్యకు యత్నించారు. ముందుగా ఆమె, ఆ తర్వాత అతడు ప్రాణాలు వదిలారు. ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాలు.. మండలంలోని దాస్ తండా పంచాయతీ రేగుల తండా గ్రామానికి చెందిన ఇస్లావత్ దీపిక(19), వెంకట్యా తండా గ్రామానికి చెందిన బోడ శ్రీను(26) ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకోవాలనుకున్నారు. దీనికి పెద్దలు అడ్డు చెప్పారు. వారిని ఆ ప్రేమ జంట ఎదిరించి, ఆరు నెలల క్రితం పెళ్లి చేసుకుంది. ఈ నవ దంపతులు.. వెంకట్యా తండాలో (శ్రీను తల్లిదండ్రులకు చెందిన ఇంట్లో) కాపురం పెట్టారు. ఆమె గర్భవతైంది. మూడో నెల. కట్నం తేవాలంటూ ఆమెను రెండు నెలలుగా అత్తామామలు వేధిస్తున్నారు. ఇంట్లో తరచూ గొడవలు అవుతున్నాయి. దీనిని ఆమె తట్టుకోలేకపోయింది. అతడు (శ్రీను) కూడా సహించలేకపోయాడు. వారిద్దరూ చనిపోవాలనుకుని నిర్ణయించుకున్నారు. ఈ నెల 20న కూల్ డ్రింక్ బాటిల్‌లో గడ్డి మందు, ఎలుకల మందు కలిపారు. దానిని ముందుగా శ్రీను తాగాడు. ఆ తర్వాత ఆమె కూడా తాగింది. ఇద్దరూ అస్వస్థులయ్యారు. వారిద్దరినీ కుటుంబ సభ్యులు ముందుగా కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అక్కడి వైద్యుల సూచనతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడే ఈ నెల 25న దీపిక మృతి చెందింది. శ్రీను కూడా ఈ నెల 28వ తేదీ తెల్లవారుజామున ప్రాణాలొదిలాడు. శ్రీను తండ్రి బోడ వీరన్న ఫిర్యాదుతో కేసు నమోదైంది. ఎస్సై రాజేందర్ దర్యాప్తు చేస్తున్నారు.

## భద్రాద్రి రామయ్యకు ముత్తంగి అలంకరణ

భద్రాచలం, ఏప్రిల్ 28: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో సోమవారం అంతరాలయంలో మూలవరులకు హైదరాబాద్‌కు చెందిన భక్తులు రూ.30లక్షలతో తయారు చేయించి సమర్పించిన ముత్యాలు పొదిగిన ప్రత్యేక గొడుగులను అర్చకులు స్వామివారికి ధరింపచేశారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి బేడామండపంలో నిత్యకల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న జంటలకు శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## అపరిచిత వ్యక్తులు కనిపిస్తే సమాచారమివ్వాలి



గొత్తికోయ ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను

ఆళ్లపల్లి, ఏప్రిల్ 28: గ్రామాల్లోకి ఎవరైనా కొత్త వ్యక్తులు ప్రవేశిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను అన్నారు. ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు ఆళ్లపల్లి పోలీసులు సోమవారం పోలీస్ స్టేషన్ పరిధిలోని గొత్తికోయ గ్రామమైన బూర్గాయి గ్రామంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ కార్యక్రమంలో డీఎస్పీ చంద్రభాను మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా ఈ గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. ఎలాంటి సమస్యలు ఉన్నా పోలీస్‌శాఖ తరఫున అట్టి సమస్యలను సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో నివసించే ఆదీవాసీ ప్రజలకు విద్య, వైద్యం, రవాణా వంటి సౌకర్యాలను అందించడంలో ఎస్పీ ఎల్లవేళలా ముందుంటారని, ఇతర శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టేకులపల్లి సీఐ సురేష్, ఆళ్లపల్లి ఎస్సై సోమేశ్వర్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆటోను ఢీకొట్టిన గుర్తు తెలియని వాహనం

### ఒకరు మృతి, మరో ఇద్దరికి గాయాలు



మృతిచెందిన శంకర్(ఫైల్)

తాడ్వాయి, ఏప్రిల్ 28: వేములవాడ వెళ్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతిచెందగా.. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రం సమీపంలో సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం గోపాల్‌రావుపేటకు చెందిన గోరంట్ల శంకర్(48) తన కుమారులు శ్రీకాంత్, మహేశ్‌లతోపాటు కోడళ్లు, తమ్ముడి కొడుకు సునీల్‌కుమార్‌తో కలిసి వేములవాడ రాజరాజేశ్వరస్వామి దర్శనానికి కరకగూడెంకు చెందిన శివరాత్రి సాగర్‌కు చెందిన ఆటోలో బయలుదేరారు. ఈ క్రమంలో తెల్లవారుజామున కాటాపురం దాటి మండల కేంద్రం సమీపంలోకి వచ్చిన తర్వాత ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఆటోను ఢీకొట్టింది. దీంతో డ్రైవర్ పక్కనే కూర్చున్న శంకర్ తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సునీల్‌కుమార్, మహేశ్, శ్రీకాంత్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి కుమారుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

28ఏఎస్‌పీటీ7: ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

## 'మత్తు'కు లొంగితే.. భవిష్యత్తంతా 'చిత్తు'

అశ్వారావుపేట, ఏప్రిల్ 28: 'మత్తు పదార్థాలకు లొంగిపోయి, వాటికి బానిసగా మారితే.. బంగారంలాంటి భవిష్యత్తంతా చిత్తుగా మారుతుంది' అని హెచ్చరిస్తూ, అప్రమత్తంగా ఉండాలని కోరుతూ స్థానిక వ్యవసాయ కళాశాల విద్యార్థులు సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. రింగ్ రోడ్ సెంటర్‌లో నాటిక ప్రదర్శించారు. ఎస్సై యయాతి రాజు, కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ టి.శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

## మా బీమా.. మీకు ధీమా..!



బీమా చెక్కు అందిస్తున్న బ్రాంచ్ మేనేజర్ ప్రదీప్

అశ్వారావుపేట, ఏప్రిల్ 28: ''మా బ్యాంక్ ఇస్తున్నది బీమా.. ఇస్తుంది మీకు ధీమా'' అని, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఖాతాదారులకు అశ్వారావుపేట బ్రాంచ్ మేనేజర్ ప్రదీప్ భరోసా ఇచ్చారు. ఆయన సోమవారం బ్యాంక్ కార్యాలయంలో ఖాతాదారులతో సమావేశమయ్యారు. బ్యాంక్ అందిస్తున్న బీమా పథకాలను వివరించారు. వీటిని వినియోగించుకోవాలని కోరారు. మండలంలోని అచ్యుతాపురం గ్రామానికి చెందిన కిన్నెర రమాదేవికి రూ.2 లక్షల బీమా చెక్కు అందించారు. బ్యాంక్ సిబ్బంది సందీప్, ఉపేందర్, జాషువా, అక్షయణి, మురళీకృష్ణ, జగదీష్, లలిత కుమారి పాల్గొన్నారు.

## తేమ శాతంలో తేడా.. ఆందోళనకు దిగిన రైతులు

చుంచుపల్లి, ఏప్రిల్ 28: మండలంలోని పెనగడప ధాన్యం కొనుగోలు కేంద్రంలోని ధాన్యం తేమ శాతం మిషన్‌పై రైతులు సందేహం వ్యక్తం చేస్తూ, రైతులు ఆందోళనకు దిగారు. తేమ శాతం 17 ఉంటేనే ధాన్యాన్ని అధికారులు కొంటారు. ఈ కేంద్రంలోని ధాన్యం శాతం చూసే మిషన్ సరిగ్గా పనిచేయడం లేదన్న అనుమానంతో రైతులు సోమవారం సొంతంగా మిషన్ తెచ్చుకున్నారు. ఏఈవో వద్దగల మిషన్.. తేమ శాతం ఎక్కువగా చూపిస్తున్నదంటూ రైతులు ఆందోళనకు దిగారు. తమ వద్దనున్న మిషన్‌లో 15 శాతంగా చూపిస్తే, ఏఈవో వద్దగల మిషన్ మాత్రం 28 శాతంగా చూపింది. దీనిపై ఏఈవోను రైతులు నిలదీశారు. ''మిషన్ చార్జింగ్ సరిగా లేనందున అలా తప్పుగా చూపుతున్నది'' అని ఆ అధికారి సమాధానమిచ్చారు.

## డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య

అశ్వారావుపేట, ఏప్రిల్ 28: డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని అచ్యుతాపురం గ్రామానికి చెందిన తెల్లగొర్ల ప్రసన్న(20), పాల్వంచలోని ప్రయివేట్ కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నది. పరీక్ష రాసేందుకు నాలుగు రోజుల క్రితం పాల్వంచ వెళ్లింది. పరీక్షలు వాయిదా పడటంతో తండ్రి వెంకటరమణకు చెప్పింది. పరీక్షలు రాసిన తర్వాతనే ఇంటికి రావాలని ఆయన స్పష్టం చేశాడు. దీంతో ఆమె ఇంటికి దూరంగా ఉండి చదువుకోలేక, తండ్రి మాటను కాదనలేక మదనపడింది. అయినప్పటికీ సోమవారం ఇంటికి వచ్చింది. ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదైంది. ఎస్సై యయాతి రాజు దర్యాప్తు చేస్తున్నారు.

## ఆటపాటలతోనే చదువు చెప్పాలి

కొత్తగూడెం టౌన్, ఏప్రిల్ 28: అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పిల్లలకు ఆటపాటలతో చదువు చెప్పాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లెనీనా అన్నారు. కొత్తగూడెం జీఆర్ బస్తీలో ఆరోగ్యలక్ష్మి కేంద్రంలో సోమవారం చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ముందుగా, చంటి పిల్లలకు అన్నప్రాసన చేయించారు. తల్లులు తప్పనిసరిగా తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్య ఏ కాన్వెంట్ స్కూల్‌లోనూ ఉండదన్నారు. సీడీపీవో పద్మశ్రీ, వార్డు మాజీ కౌన్సిలర్ సాహెరా బేగం తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ



నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

# అర్హుల ఎంపికలో ఒత్తిళ్లకు గురికావొద్దు : పీవో



సమావేశంలో మాట్లాడుతున్న పీవో రాహుల్

భద్రాచలం, ఏప్రిల్ 28: ఎవరి వత్తిళ్లకు గురికాకుండా పారదర్శకంగా రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను గుర్తించి కమిటీ సభ్యులతో అర్హులైన వారి జాబితా తయారు చేయాలని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఐటీడీఏ ప్రత్యేకాధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన కమిటీలో తీసుకోవాల్సిన కార్యాచరణపై చర్చించారు. 22 మండలాలు, నాలుగు మున్సిపాలిటీల్లో జరిగే రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన కమిటీలో గిరిజన నిరుద్యోగ యువత దరఖాస్తులను మండల లెవల్ స్క్రీనింగ్ కమిటీతో పరిశీలన చేసి అర్హుల జాబితాను తయారు చేసేలా జాగ్రత్తలు తీసుకోవాలని, పథకానికి 21,792 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వేసవి సెలవులు నడుస్తున్నందున గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో మైనర్ రిపేర్లు, మేజర్ రిపేర్లు ఉంటే మీ పరిధిలోని పాఠశాలలు సందర్శించి యాక్షన్‌ప్లాన్ తయారు చేయించాలన్నారు. సమావేశంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్, ఈఈ చంద్రశేఖర్, ఎస్‌డీసీ రవీంద్రనాథ్, ఆర్‌సీవో గురుకులం నాగార్జునరావు, ఐటీడీఏ ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

**హాస్టల్ వెల్ఫేర్ అధికారుల పోస్టులకు కౌన్సిలింగ్‌తో అభ్యర్థుల భర్తీ : పీవో**

తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా హాస్టల్ వెల్ఫేర్ అధికారుల పోస్టులకు ఎంపిక చేయబడిన అభ్యర్థులకు త్వరలో కౌన్సిలింగ్ ద్వారా పాఠశాలలు, వసతిగృహాల్లో భర్తీ చేస్తామని ఐటీడీఏ పీవో రాహుల్ సోమవారం తెలిపారు. పీఎంఆర్‌సీ భవనంలో హాస్టల్ వెల్ఫేర్ అధికారులుగా ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లు ఆయన పరిశీలన చేసి మాట్లాడారు. డీడీ మణెమ్మ, సోషల్ వెల్ఫేర్ అధికారి అనసూయ, బీసీ వెల్ఫేర్ అధికారి ఇందిర, ఏసీఎంవో రమణయ్య, ఏటీడీవోలు అశోక్‌కుమార్, చంద్రమోహన్, రాధమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

# నా కోడలు గెంటేసింది

- ఇల్లు సహా ఆస్తి అంతా రాయించుకుంది..
- ఇంట్లోంచి వెళ్లగొట్టింది..
- నాకు న్యాయం చేయాలి..
- 'కోడలి ఇంటి' ముందు అత్త ఆందోళన



కోడలు ఇంటి ముందు బైఠాయించిన అత్త సీతమ్మ

అశ్వారావుపేట, ఏప్రిల్ 28: న్యాయం కోసం 80 ఏళ్ల వయస్సులో ఓ వృద్ధురాలు పోరుబాట పట్టింది. తన పేరున ఉన్న ఆస్తిని కోడలు రాయించుకుని, ఇంటి నుంచి గెంటేసిందని ఆవేదన వ్యక్తం చేసింది. పోలీస్ అధికారులు కూడా న్యాయం చేయడం లేదంటూ కన్నీటిపర్యంతమైంది. ఆమె తెలిపిన వివరాలు.. మండలంలోని నారంవారిగూడెం కాలనీకి చెందిన మనుగొండ సీతమ్మ-రాజాలు దంపతులకు ఒక్కడే కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వీరందరికీ వివాహాలయ్యాయి. రాజాలుకు మొత్తం 11 ఎకరాల భూమి ఉంది. కుమార్తెలకు ఎకరం చొప్పున మూడు ఎకరాలు ఇచ్చాడు. కుమారుడు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. దీంతో, కోడలికి ఆరు ఎకరాల భూమి రాసిచ్చాడు. మిగిలిన రెండెకరాల భూమిని తన వద్దనే ఉంచుకున్నాడు. తమ (రాజాలు-సీతమ్మ దంపతులు) బాగోగులను చివరి వరకూ చూసుకున్న వారికి, తదనంతరం ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. ఐదేళ్ల క్రితం రాజాలు కూడా మృతిచెందాడు. దీంతో, సీతమ్మ తన కోడలికి మరో ఎకరం భూమి రాసిచ్చి, తన వద్ద ఒకే ఒక ఎకరం ఉంచుకుంది. కానీ, ఆ ఒక్క ఎకరంతోపాటు ఇంటిని కూడా కోడలు రాయించుకుంది. ఆ తర్వాత, అత్త సీతమ్మను ఇంటి నుంచి గెంటేసింది. తనకు న్యాయం చేయాలంటూ ఎనభయ్యేళ్ల ఆ వృద్ధురాలు పోలీస్, రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం కనిపించలేదు. దీంతో, తనకు న్యాయం చేయాలని అధికారులను వేడుకుంటూ కోడలు ఇంటి ముందు సోమవారం బైఠాయించింది. మండుటెండలో కూర్చున్న ఆమె వద్దకు కూతురు తిరుపతమ్మ వచ్చి, తన ఇంటికి తీసుకెళ్లింది. తన మొర ఆలకించాలని సీతమ్మ వేడుకుంటున్నది.

## ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో ఎదురుకాల్పులు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, ఏప్రిల్ 28 : ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. ప్రాథమిక వివరాల ప్రకారం.. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు కర్రెగుట్టలో వారం రోజులుగా సెర్చింగ్ ఆపరేషన్ జరుగుతున్న విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా.. మూడు రోజుల క్రితం అదే ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మహిళా మావోయిస్టుల మృతదేహాలను సైతం భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. కాగా.. తాజాగా సోమవారం సాయంత్రం బీజాపూర్ జిల్లా నడిపల్లి-గల్గామ్ మధ్య గల అటవీ ప్రాంతంలో మావోయిస్టులు తారసపడి జవాన్లపైకి కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన జవాన్లు మావోయిస్టులున్న ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి ఎదురుకాల్పులు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.

**24 మంది మావోయిస్టుల లొంగుబాటు**

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ మావోయిస్టులపై దండయాత్ర చేస్తున్న తరుణంలో ఆ పార్టీపై తీవ్ర ఒత్తిడి పెరుగుతున్నది. ఈ క్రమంలోనే మావోయిస్టులు లొంగుపోయేందుకు ముందుకు వస్తున్నట్లు తెలుస్తున్నది. ఇందులో భాగంగానే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పోలీస్ అధికారుల ఎదుట 24 మంది మావోయిస్టులు సోమవారం లొంగిపోయారు. వారిలో 14 మందిపై రూ.28.50 లక్షల రివార్డు ఉన్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు.

## అంతర్రాష్ట్ర దొంగలపై నిఘా ఉంచాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ

దమ్మపేట రూరల్, ఏప్రిల్ 28: అంతర్రాష్ట్ర దొంగలపై నిఘా ఉంచాలని, చోరీలను నివారించాలని స్థానిక పోలీస్ అధికారులను ఎస్పీ రోహిత్ రాజు ఆదేశించారు. దమ్మపేట పోలీస్ స్టేషన్‌ను ఆయన సోమవారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. తరచుగా ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. అశ్వారావుపేట సీఐ నాగరాజు, ఎస్ఐ సాయికిషోర్ రెడ్డి పాల్గొన్నారు.

## సీఐ నాగరాజుకు సన్మానం

భద్రాచలం, ఏప్రిల్ 28: భద్రాచలం సీఐగా బాధ్యతలు చేపట్టిన మడిపల్లి నాగరాజుకు భద్రాచలం బ్లడ్ ఆర్గనైజర్లు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐ నాగరాజును శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ట్రాఫిక్ నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన తిరుపతిని కూడా శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. కార్యక్రమంలో బ్లడ్ ఆర్గనైజర్లు మహమ్మద్ సింధా, కొప్పుల మురళి, మల్లెల లోకేష్, గాడి విజయ్, ఎస్‌కె.మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతి చర్చలు జరపండి..

### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మావోయిస్టు పార్టీ విజ్ఞప్తి లేఖ

కొత్తగూడెం ప్రగతి మైదాన్, ఏప్రిల్ 28 : ఎలాంటి షరతులు లేకుండా శాంతి చర్చలు జరపాలంటూ మావోయిస్టు పార్టీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖ విడుదల చేసింది. ఈ మేరకు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో సోషల్ మీడియాలో విడుదలైన లేఖ సంచలనం సృష్టించింది. 2024 జనవరి నుంచి కేంద్ర, రాష్ట్ర పోలీసులు, పారా మిలిటరీ, కమాండో బలగాలు ఆపరేషన్ 'కగార్' పేరుతో మావోయిస్టు విప్లవోద్యమ ప్రాంతాల్లో వందలాది మంది మావోయిస్టులను, అమాయక ఆదివాసీలను హత్య చేయడాన్ని ఖండిస్తూ.. దేశ వ్యాప్తంగా, అంతర్జాతీయంగా అనేక ప్రజాస్వామిక, విప్లవ ప్రజా సంఘాలు, మేధావులు వందలాది మంది ఉద్యమిస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. తమ పార్టీ కేంద్ర కమిటీ ప్రభుత్వంతో శాంతి చర్చలకు సిద్ధమని మార్చి 28న ఒక ప్రకటన విడుదల చేసినట్లు తెలిపారు. శాంతి చర్చల కోసం తమ పార్టీ ఇప్పటికే మూడు ప్రకటనలు జారీ చేసిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జార్ఖండ్ రాష్ట్రం బొకారో హత్యాకాండలో తమ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ వివేక్‌తోపాటు మరి కొందరిని హత్య చేసినట్లు తెలిపారు. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు కర్రెగుట్ట ప్రాంతాల్లో సుమారు 10 వేల మంది సాయుధ బలగాలతో దిగ్బంధించి, తమ పార్టీకి చెందిన ఆరుగురు కామ్రేడ్స్‌ను హత్య చేయమే కాకుండా, నాయకత్వాన్ని హత్య చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని పేర్కొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో కాంట్రాక్టర్ ఆత్మహత్య

పాల్వంచ, ఏప్రిల్ 28: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ సివిల్ కాంట్రాక్టర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన పాల్వంచ నవభారత్ పవర్ ప్లాంట్‌లో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పాల్వంచ పట్టణంలోని టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్న ఉప్పల గిరీషం వెంకట్రామ్(58) నవభారత్ 150 మెగావాట్ల పవర్ ప్లాంట్‌లో సివిల్ కాంట్రాక్టర్‌గా చిన్న చిన్న పనులు చేయించేవాడు. ఈ క్రమంలో రెండేళ్ల క్రితం కూతురు పెళ్లి చేయడం.. కొంతకాలం నుంచి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న వెంకట్రామ్ ఇల్లు కూడా అమ్మేశాడు. అయినప్పటికీ అప్పులు తీరే పరిస్థితి లేకపోవడంతో సోమవారం పవర్ ప్లాంట్ గేటు వద్ద తన ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేశాడు. నడుచుకుంటూ వెళ్లి కూలింగ్ టవర్ వద్ద సెల్‌ఫోన్, ఇతర వస్తువులను పక్కనపెట్టి టవర్‌లోని నీళ్లలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పాల్వంచ పట్టణ ఎస్సై సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సంక్షిప్తం

### పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా

చండ్రుగొండ, ఏప్రిల్ 28: నిరుపేదలకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్న డిమాండుతో సీపీఎం నాయకులు సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. పెద్దిని వేణు, ఐలూరి రామిరెడ్డి, గాలి రామారావు, విప్పర్ల పెద్దవెంకటేశ్వర్లు, రాయి రాజా, కాంతరావు తదితరులు పాల్గొన్నారు.

### టీబీ వైద్య శిబిరం

చుంచుపల్లి, ఏప్రిల్ 28: మండలంలోని పెనగడప పంచాయతీ జగ్గారం ఆదివాసీ గ్రామంలో టీబీ వైద్య శిబిరాన్ని సోమవారం పెనగడప పీహెచ్‌సీ డాక్టర్ అంబ్రీన్ నిర్వహించారు. అనుమానితులకు తెమడ, ఎక్స్‌రే పరీక్షలు చేశారు. వైద్యులు, సిబ్బంది కె.వెంకటేశ్వర్లు, మహేందర్, శ్యామ్, సుభద్ర, శిరీష, వెంకటేశ్వర్లు, సీతాకుమారి, దేవి, జ్యోతి, జయమ్మ పాల్గొన్నారు.

### 33 కేవీ ఇంటర్‌లింక్ లైన్ ప్రారంభం

దమ్మపేట/దమ్మపేట రూరల్, ఏప్రిల్ 28: మండలంలోని లింగాలపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి గండుగులపల్లి సబ్ స్టేషన్ వరకు 33 కేవీ ఇంటర్‌లింక్‌లైన్‌ను సూపరింటెండెంట్ ఇంజినీర్ మహేందర్ సోమవారం ప్రారంభించారు. కన్‌స్ట్రక్షన్ ఆపరేషన్ డివిజనల్ ఇంజినీర్ నందయ్య, ఏడీఈ వెంకటరత్నం, ఏఈలు రాజేష్, రమేష్‌బాబు, రవి తదితరులు పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 28: మండలంలోని కట్టుగూడెంలో భాగ్యశ్రీ మహిళా గ్రామ సమాఖ్య ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఐకేపీ ఏపీఎం మీరాబీ ప్రారంభించారు. ఐకేసీ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ ఉద్యమకారుడు బుచ్చిరెడ్డికి నివాళి

ఇల్లెందు, ఏప్రిల్ 28: ఇల్లెందు నియోజకవర్గంలోని బయ్యారం గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు రేటాల బుచ్చిరెడ్డి సోమవారం మృతిచెందారు. మృతదేహాన్ని ఉద్యమ నేత, బీఆర్ఎస్ నాయకుడు దిండిగాల రాజేందర్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు. ఆజ్మీరా బావ్ సింగ్ నాయక్, కాసాని హరిప్రసాద్, భూక్యా నాగేశ్వరరావు, శీలంశెట్టి ప్రవీణ్‌కుమార్, ఎంటెక్ మహేందర్, వీరభద్రం, శంకర్‌రావు, మురళీతారక్ తదితరులు పాల్గొన్నారు.

## టీషర్టులు తిరస్కరించిన కార్మికులు



నిరసన తెలుపుతున్న కార్మిక సంఘ నాయకులు

బూర్గంపహాడ్, ఏప్రిల్ 28: ఐటీసీ యాజమాన్యం కార్మికులకు అందించిన టీషర్టులను కార్మికులు సోమవారం తిరస్కరించారు. ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు గోనె రామారావు, బీఆర్‌టీయూ అధ్యక్షుడు సానికొమ్ము శంకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఐటీసీ యాజమాన్యం కార్మికులకు ఇచ్చే టీషర్టులు కార్మికుల అభిప్రాయం తీసుకోకుండా ఏకపక్ష నిర్ణయంతో వ్యవహరించడాన్ని ఖండించారు. టీషర్టు కలర్ పసుపురంగులో ఎలా ఇస్తుందని, ఇది ఒక యూనియన్‌కి సంబంధించిన రంగు అని తెలియదా.. అంటూ మండిపడ్డారు. ఒక యూనియన్ రంగును కార్మికులపై రుద్దడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ టీషర్టులు తిరస్కరించి యాజమాన్యానికి వినతిపత్రం అందజేశారు. వెంటనే రంగు మార్చి గతంలో మాదిరిగానే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, అశోక్‌రెడ్డి, సింగమనేని ప్రసాద్, వెంకటేశ్వర్లు, వెంకటరమణ, షేక్ అబ్దుల్ సలీం, సాబీర్, కార్మికులు పాల్గొన్నారు.

28బీసీఎం05: మోడల్ పరీక్ష ప్రశ్నాపత్రంతో లిటిల్ ఫ్లవర్స్ యాజమాన్యం

## ఎప్‌సెట్ మోడల్ పరీక్ష విజయవంతం

భద్రాచలం, ఏప్రిల్ 28: విద్యార్థుల్లో పోటీ పరీక్షల భయం పోగొట్టేందుకు ముందస్తు మోడల్ పరీక్ష దోహదపడుతుందని లిటిల్‌ఫ్లవర్స్ విద్యాసంస్థల డైరెక్టర్లు మాగంటి ప్రసాద్‌బాబు, రమేష్‌బాబు అన్నారు. సోమవారం లిటిల్‌ఫ్లవర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎప్‌సెట్ మోడల్ పరీక్ష పత్రాలను వారు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి ఏడాది ఎప్‌సెట్ మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా ఈ ఏడాది కూడా మూడు దఫాలుగా పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎప్‌సెట్ కోచింగ్‌లో అనుభవం కలిగిన ఉపాధ్యాయులచే తయారు చేసిన ప్రశ్నాపత్రం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల గణితం అధ్యాపకులు ఎండి.బషీర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దుమ్ముగూడెం, ఏప్రిల్ 28: దుమ్ముగూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో మంగళ, బుధవారాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ మోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో ఫీడర్లకు పాత బ్రేకర్లు తీసి కొత్త బ్రేకర్లు అమర్చడం జరుగుతుందని, దీంతో 29, 30 తేదీల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

## నేడు భూ భారతి రెవెన్యూ సదస్సు

బూర్గంపహాడ్, ఏప్రిల్ 28: రైతాంగం ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం కోసం, భూ హక్కుల భద్రత, భరోసా కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన భూభారతి చట్టంపై మంగళవారం సాయంత్రం 3 గంటలకు బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ముజాహిద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై రైతులకు భూ భారతి చట్టం విధి విధానాలు, భూభారతి పోర్టల్ తీరుతెన్నులపై అవగాహన కల్పిస్తారన్నారు. రైతులు సకాలంలో సదస్సుకు హాజరై భూభారతి చట్టంపై అవగాహన పెంచుకోవాలని కోరారు.

## ఆళ్లపల్లి తహసీల్దార్‌గా రాఘవరెడ్డి



తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన రఘువరెడ్డి

ఆళ్ళపల్లి, ఏప్రిల్ 28: ఆళ్ళపల్లి నూతన తహసీల్దార్‌గా వి.రాఘవరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మణుగురు తహసీల్దార్‌గా విధులు నిర్వహించి బదిలీపై ఆళ్ళపల్లికి వచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ రెవెన్యూ పరమైన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం రెవెన్యూ సిబ్బంది నూతన తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.


## గుండాల తహసీల్దార్‌గా రాజారావు

గుండాల, ఏప్రిల్ 28: గుండాల తహసీల్దార్‌గా రాజారావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ ఇమ్మాన్యుయేల్ మణుగూరుకు బదిలీకాగా ఆయన స్థానంలో కొత్తగూడెం ఆర్‌డీవో కార్యాలయం నుంచి రాజారావు గుండాలకు బదిలీపై వచ్చారు.

## సభ విజయవంతం.. సభికులకు వందనం

కొత్తగూడెం అర్బన్, ఏప్రిల్ 28: 'బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతమైంది. సభికులందరికీ కృతజ్ఞతలు' అని, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జిలు వనమా వెంకటేశ్వరరావు (కొత్తగూడెం), మెచ్చా నాగేశ్వరరావు (అశ్వారావుపేట), బానోత్ హరిప్రియానాయక్ (ఇల్లెందు) సోమవారం వేర్వేరుగా ప్రకటన చేశారు. 'కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత.. లక్షలమంది హాజరైన ఈ సభతో తేటతెల్లమైంది. భవిష్యత్తులో ఏ ఎన్నికలు జరిగినా బీఆర్ఎస్ పార్టీ విజయం తథ్యం. పార్టీని తిరుగులేని శక్తిగా తయారు చేస్తాం' అని పేర్కొన్నారు.

## అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, వారి గురువులు

కొత్తగూడెం సింగరేణి ఏప్రిల్ 28: రామవరం ప్రభుత్వ పాఠశాలలో 1999-20 సంవత్సరం పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు అదే పాఠశాల వేదికగా సోమవారం అపూర్వ సమ్మేళనంలో కలుసుకున్నారు. జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. గురువులను సన్మానించారు. పూర్వ విద్యార్థులు కామ కమలాకర్, వెంకటనారాయణ, శరత్, నరేష్, మహేష్, లోకేష్, రజిని, లావణ్య, నాటి ఉపాధ్యాయులు మాధవరావు, రామకృష్ణారెడ్డి, ఉషారాణి, శ్రీనివాస్, రామకృష్ణ, సలీమ్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.